క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరసవల్లి: శ్రీకాకుళంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లుగా ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు, డీ–2 ఏఈ సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పీఎన్ కాలనీ, భైరవానిపేట, కిమ్స్ రోడ్డు, హడ్కో కాలనీ, శాంతినగర్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, బలగ, రైతుబజార్ రోడ్డు, పాలకొండ రోడ్డు, పెద్ద రెల్లి వీధి తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

జి.సిగడాం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం జి.సిగడాం మండలంలో పర్యటిస్తారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ తెలిపారు. ఉదయం 10 గంటలకు వాండ్రంగి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరు చేసిన వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 11 గంటలకు చెట్టుపొదిలాంలో జల్ జీవన్ ద్వారా తాగునీటిని ప్రజలకు అంకితం చేస్తారని చెప్పారు. 11.30 గంటలకు గెద్దకంచరాంలో సచివాలయం, రూ.82 లక్షలతో జలజీవన్ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నాయకులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

ఫర్నీచర్ వితరణ



ఫర్నీచర్‌ను అందజేస్తున్న న్యాయవాది కృష్ణప్రసాద్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలోని బార్ అసోసియేషన్ కార్యాలయానికి సీనియర్ న్యాయవాది గెద్దాపు శ్రీకృష్ణప్రసాద్ సుమారు రూ. 50 వేల విలువైన టేబుళ్లు, కుర్చీలను వితరణగా అందజేశారు. వీటిని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు సమక్షంలో శుక్రవారం అందజేయగా.. కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు రక్షాబంధన్..

ప్రజాపిత బ్రాహ్మకుమారీలతో శనివారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు తెలిపారు.

మెహెర్‌బాబా కేంద్రం వార్షికోత్సవం రేపు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని కత్తెరవీధిలో ఉన్న మెహెర్‌బాబా కేంద్రం 62వ వార్షికోత్సవాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, సప్తవర్ణ పతాకావిష్కరణ, మెహెర్ ప్రేమికా సహవాస్, పేదలకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

దోమల నివారణకు చర్యలు



అదపాక హాస్టల్‌లో దోమలు నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

లావేరు: దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని పొందూరు సబ్‌యూనిట్ మలేరియా నివారణ అధికారి టి.సురేష్ అన్నారు. మురపాక ,అదపాక గ్రామా బీసీ హాస్టల్స్, పీబీ నగర్ కాలనీ కేజీబీవీల్లో శుక్రవారం దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల సీజన్ కావడంతో దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయన్నారు. మలేరియా వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో మురపాక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టరు టి.సౌమ్య, హెల్త్ అసిస్టెంట్ ఆర్.శ్యామ్ సుందర్, వార్డెన్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేపై అభ్యంతరాలు తెలియజేయండి



మాట్లాడుతున్న ఆర్వో జయదేవి

నరసన్నపేట: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన ఇంటింటా సర్వే ప్రక్రియ విజయవంతంగా నియోజకవర్గంలో జరిగిందని నరసన్నపేట రిటర్నింగ్ అధికారి జయదేవి చెప్పారు. అయితే ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నాయకులు తెలియజేయాలని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితాపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నెల రోజుల పాటు జరిగిన ఇంటింటి సర్వేని వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయడం జరిగిందన్నారు. అభ్యంతరాలు ఉంటే త్వరగా చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బీఎల్ఏలు, బీఎల్‌ఓలతో రెండుసార్లు గ్రామాల్లో సమావేశాలు సైతం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీరాములు, సత్యం, హనుమంతురావు, సింహాచలం, డీటీ శరత్, వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.



సంతోషిమాత ఆలయంలో పూజలు



బాదుర్లపేట గౌరీదేవి అలంకరణ



గుడివీధిలోని రాజరాజేశ్వరికి పూజలు



విజయగణపతికి ప్రత్యేక అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో పూజలందుకున్న ఉమాదేవి అమ్మవారు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలు

● ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: వరలక్ష్మి పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. శ్రావణ మాసంలో అత్యంత ముఖ్యమైన రోజు కావడంతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేశారు. అమ్మవారి కలశాలను పెట్టి నిండుగా అలంకరించారు. ఆయురారోగ్యాలతో పాటు సౌభాగ్యంతో కళకళ లాడాలని కోరుకున్నారు. సత్యసాయి మందిరాలు, అమ్మవారి ఆలయాల్లో సామూహికంగా వ్రతాలు జరిగాయి

ధైర్యలక్ష్మిగా విజయదుర్గ

శ్రీకాకుళం పట్టణం నానుబాల వీధిలోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారిని ధైర్యలక్ష్మీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ పూజలు చేశారు. భక్తులకు అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

విజయగణపతికి ప్రత్యేక అలంకరణ

పాలకొండ రోడ్డులోని విజయగణపతిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు చందనం, పూలతో పూజలు చేశారు.

సత్యసాయి మందిరంలో

పాలకొండ రోడ్డులోని సత్యసాయి సేవా సమితి పెద్ద మందిరంలో మహిళలచే సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. సుమారు 180 మంది మహిళలు సంప్రదాయబద్ధంగా వ్రతాలు చేశారు. వరం చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టు అందవరపు ప్రసాద్ దంపతులు, పూర్వపు జిల్లా అధ్యక్షుడు గంగుల రమణబాబు, జిల్లా కన్వీనర్ సూర రామచంద్రరావు, మందిరం కన్వీనర్ కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో..

పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, ఉషఃకాలార్చనలు, బాల భోగసేవ, శ్రీచక్రార్చనలు నిర్వహించారు.

• గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి శ్రీలలితా సంఘం నేతృత్వంలో కుంకుమపూజలు జరిగాయి. నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

• కోదండ రామాలయంలోని మహాలక్ష్మికి, బలగ అయ్యప్పస్వామి ఆలయంలో, గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీ అమ్మవారికి, దీపామహల్ వెనుకనున్న బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివబాలాజీ ఆలయంలో సామూహిక వరలక్ష్మి పూజలు జరిగాయి. చిందత్తనాథ క్షేత్రంలో గాయత్రీ అమ్మవారిని చక్కగా అలంకరించి సామూహిక వ్రతాలు నిర్వహించారు. బాదుర్లపేట గౌరీపరమేశ్వర దేవాలయంలో కూడా పూజలు నిర్వహించారు.



సత్యసాయి పెద్దమందిరంలో సామూహిక వ్రతాలు

త్రిపుర సుందరికి 131 రకాల పిండివంటలతో నైవేద్యం

బలగ నాగావళి నదీతీరాన ఉన్న బాల త్రిపుర కాలభైరవ దేవాలయంలో వరలక్ష్మి వ్రతంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేకంగా గాజులతో అలంకరించారు. 131 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. పీఠం గురుజీ గణేష్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.

శివబాలాజీ ఆలయంలో లక్ష కుంకుమార్చనలు

శ్రీకాకుళం కల్చరల్: బ్యాంకర్స్ కాలనీ శివబాలాజీ ఆలయంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంమవ మహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు జరిగాయి. 108 మంది మహిళలచే అర్చకులు సామూహిక కుంకుమపూజలు జరిపించారు. అలాగే బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో సామూహిక కుంకుమార్చలు జరిగాయి. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో కూడా ఉమాదేవికి సామూహిక కుంకుమ పూజలు చేశారు.

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



కోదండరామాలయంలో మహాలక్ష్మికి అభిషేకాలు

లావేరు: మండలంలోని లావేరు, మురపాక, తామాడ, బుడుమూరు, అదపాక, పాతకుంకాం, బెజ్జిపురం, గుమడాం, కేశవరాయునిపాలేం, వెంకటాపురం గ్రామాల్లో కనకదుర్గ, సంతోషిమాత, విజయదుర్గ ఆలయాల్లో వరలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు శ్రీకాకుళం తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు, లావేరు మాజీ జెడ్పీటీసీ నిడిగంట్ల త్రినాథ్ లావేరు కనకదుర్గ ఆలయంలో వరలక్ష్మి పూజల్లో పాల్గొన్నారు.



గాజుల అలంకరణలో బాల త్రిపుర సుందరీమాత



లావేరు: కనకదుర్గ ఆలయంలోవరలక్ష్మీ పూజలు

జి.సిగడాం : మండల వ్యాప్తంగా శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు.



శ్రీకాకుళం కల్చరల్: శివబాలాజీ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



గుడివీధిలోని రాజరాజేశ్వరికి పూజలు



సంతోషిమాత ఆలయం వద్ద క్యూలో భక్తులు

● సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే కిరణ్



సాలూరులో 561.88 ఎకరాల్లో రూ.834 కోట్లతో నెలకొల్పుతున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు విచ్చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి, కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. – రణస్థలం

డిసెంబర్ నాటికి రోడ్లన్నీ నిర్మాణం



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధర్మాన

● మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని అరసవల్లి మిల్లు జంక్షన్ నుంచి 80 అడుగుల రోడ్డు మీదుగా వాంబేకాలనీ వరకు రహదారి నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పట్టణంలోని అన్ని రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. డిసెంబర్ నాటికి ప్రతిపాదనలో ఉన్న అన్ని రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. ప్రధాన రహదారుల్లో సీసీరోడ్లు వేయాలని నిర్ణయించామన్నారు. గుంతలు లేకుండా అన్ని రోడ్లు అందుబాటులోకి వచ్చి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నిర్మాణం పూర్తయ్యాక తానే స్వయంగా నిర్మాణాన్ని, నాణ్యతా తీరును పరిశీలిస్తానన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేషు, కళింగ కోమటి, కాపు కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెంటాడ స్వరూప్, కాంట్రాక్టర్ కింజరాపు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సాధు వైకుంఠ రావు, కె.ఎల్.ప్రసాద్, ప్రకాష్, రంగాజీ, బేగ్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 87 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం చెన్నైకు చెందిన మిస్టుబా కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచిన 87 మంది ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి రూ.2.30 లక్షల వార్షిక ప్యాకేజీ, వసతి కల్పనలతో కూడిన హామీపత్రాలను కంపెనీ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.టి.చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ బి.ప్రసాద్ పర్యవేక్షించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, బోధన సిబ్బంది

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం నుంచి స్మార్ట్ కెం పరిశ్రమ వరకు మరమ్మతులు చేయనున్న తారురోడ్డు పనులను ఎంపీపీ మొదలవలస చిరంజీవి శుక్రవారం ప్రారంభించారు. రూ.4.50 లక్షలతో పరిశ్రమ యాజమాన్యం ఈ పనులు చేపడుతున్నట్లు వివరించారు. మహాధన్ అగ్రిటెక్ ఈ పనులు నిర్వహించనుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముద్దాడ శంకర్, మురళీధర్‌బాబా, బెండు రామారావు, బొడ్డేపల్లి సుధాకర్, బగ్గు రాజారావు, నక్క కృష్ణమూర్తి, గుండ రవి, అల్లు సూర్యనారాయణ పాల్గొన్నారు.

శరవేగంగా గృహ నిర్మాణ పనులు



మాట్లాడుతున్న డీఈఈ అప్పారావు

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన జగనన్న గృహాలకు సంబంధించి పనులు శరవేగంగా జరుగుతున్నాయని డీఈఈ కె.అప్పారావు అన్నారు. శుక్రవారం చెట్టుపొదిలాం, ఎస్.పి.ఆర్.పురం, పాలఖండ్యాం, జి.సిగడాం గ్రామాల్లో గృహ నిర్మాన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో 10,951 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిలో సుమారు 7వేల గృహాల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. సకాలంలో బిల్లులు చెల్లింపు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇంకా అర్హులు ఉంటే స్థలాలు మంజూరు చేసేందుకు ప్రభు త్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పనులు ప్రారంభం చేయని గృహాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రద్దు చేస్తామన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఈ మహదాసుల రమేష్, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, సిబ్బంది యువరాజ్, శ్రీనివాసరావు, సురేంద్ర పాల్గొన్నారు.

ఓటరు జాబితాలు పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: బూత్ లెవల్ స్థాయిలో రూపొందిస్తున్న ఓటర జాబితాలను వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పరిశీలించాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి సూచించారు. చిలకపాలెంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అర్హత గల ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల పార్టీ అధ్యక్షుడు ముందాడ శంకర్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు మురళీధర్ బాబా, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకరరావు, దొంత వెంకటరమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.